కాపాడితేనే రాబడి



ఎండలో మేత మేస్తున్న పశువులు

- వేసవిలో పాడిపశువుల సంరక్షణ తప్పనిసరి
- నిర్లక్ష్యం చేస్తే తీవ్ర ఇబ్బందులు



ఎచ్చెర్ల మండల పశువైద్యాధికారి వి.రమణ



పాకలో కట్టిన పశువులు

ఎచ్చెర్ల: రోజురోజుకూ పెరుగుతున్న ఎండల తీవ్రత నేపథ్యంలో పాడి రైతులు తగు జాగ్రత్తలు పాటిస్తేనే పాడి పశువులను కాపాడుకోవచ్చని ఎచ్చెర్ల మండల పశువైద్యాధికారి డాక్టర్ వి.రమణ సూచించారు. చలువ పందిళ్ల కింద పశువులను ఉంచడం వల్ల ఆరోగ్యంగా ఉంటాయని చెప్పారు. వేసవి ఎండలు, పాల దిగుబడి, పశువుల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన 'సాక్షి'కి వివరించారు.

గాలి తగలాలి..

- పశువులకు కొట్టం ఏర్పాటు చేసుకోవాలి. పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. కొట్టంలోకి గాలి, వెలుతురు బాగా ప్రవేశించేలా ఏర్పాటు చేసుకోవాలి.
- పరిశుభ్రమైన చల్లని నీరు పశువులకు అందుబాటులో ఉంచాలి. పచ్చని గడ్డి, ఎండుగడ్డి సమృద్ధిగా అందించాలి.
- సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించి అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యాధులకు కారణమయ్యే గోమార్లు, దోమలు, ఈగలను నిర్మూలించాలి.
- గేదెల పాకలు చల్లగా ఉండేలా చూసుకోవాలి. పశువుల పాక పైకప్పును గడ్డితో కప్పి నీళ్లు చల్లుతూ ఉండాలి. వీలైనంత వరకూ పాక పరిసరాల్లో చల్లటి నీడనిచ్చే కానుగ, బాదం, వేపచెట్లు పెంచుకోవాలి.
- రోజుకు రెండు మూడు సార్లు పశువులను చల్లటి నీటితో కడగాలి. వేసవిలో ఉదయం పది గంటలలోపు, సాయంత్రం ఐదు గంటల తర్వాత మాత్రమే మేత కోసం పశువులను బయటకు తోలాలి. ఎండ ఉన్న సమయంలో మేతకు బయటకు తోలకూడదు.

మండలం	ఆవులు	గేదెలు	గొర్రెలు	మేకలు
ఎచ్చెర్ల	16,800	120	12,940	3,942
జి.సిగడాం	12,920	420	18,420	2,940
లావేరు	12,340	392	34,200	6000
రణస్థలం	12,987	482	52340	4,500

వడదెబ్బ లక్షణాలు

వడదెబ్బ తగిలిన పశువుల్లో శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. చెమటలు ఎక్కువగా బయటకు రావటం, దాహం అధికంగా పెరగడం, మేత సరిగా మేయకపోవడం, శ్వాస కష్టంగా ఉండటం, ఎదకు సరిగా రాకపోవడం, గర్భస్రావం వంటి సమస్యలు తలెత్తుతాయి.

చికిత్స..

వడదెబ్బకు గురైన పశువులను గుర్తించి వెంటనే చికిత్స చేయించాలి. చల్లటి ప్రదేశాల్లో ఉంచి తేలికగా జీర్ణమయ్యే దాణా, గంజిలో ఉప్పు కలిపి ఆహారంగా ఇవ్వాలి. వైద్యులను సంప్రదించి డెక్రోజ్ సైలైన్ ద్రావణాన్ని రక్తనాళంలోకి విటమిన్ ఏ, డీ సూదిమందులను, విటమిన్ సీ, బీ కాంప్లెక్స్ సూదిమందులను వేయించాలి. రోజుకు 40 లీటర్ల నీటిని తాగించాలి.

పచ్చిమేతే రక్షణ

వేసవిలో పశువులకు పచ్చిమేత అందించాలి. పచ్చిగడ్డి పశువుల శరీర ఉష్ణోగ్రతను తగ్గిస్తుంది. పోషక విలువల కోసం ఖనిజ లవణ మిశ్రమం (మినరల్ మిక్సర్) వంటివి వాడాలి. పచ్చగడ్డి సదుపాయం లేని రైతులు పాతర వేసిన యూరియా గడ్డిని అందిస్తే ఫలితం ఉంటుంది. ఇందులో 45–55 శాతం వరకూ తేమ ఉంటుంది. శరీర ఉష్ణోగ్రత తగ్గి పాల దిగుబడి పెరిగే అవకాశం ఉంది. పశువుల పాక వద్ద పేడ, పెంటకుప్పల మీద వాలే దోమలు, ఈగల నివారణకు క్రిమిసంహారక మందులు పిచికారీచేయాలి.

క్లుప్తంగా

బీటీ రోడ్డు పనుల పరిశీలన



బంటుపల్లిలో బీటీ రోడ్డును పరిశీలిస్తున్న ఈఈ రామకృష్ణారావు

రణస్థలం: గ్రామాల పరిధిలో జరుగుతున్న తారురోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పంచాయతీరాజ్ ఈఈ ఎస్.రామకృష్ణారావు సిబ్బందికి సూచించారు. బంటుపల్లి పంచాయతీలో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో జరుగుతున్న తారు రోడ్డు పనులను శుక్రవారం పరిశీలించారు. రోడ్డు కొలతలు, సాంద్రతను పరీక్షించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈ ఎల్.అప్పన్న, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మురళి పాల్గొన్నారు.

డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లపై అవగాహన



మాట్లాడుతున్న సీసీఏ తారాచంద్

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని ఓ హోటల్లో శుక్రవారం బీఎస్ఎన్ఎల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికాం పెన్షనర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏపీ సర్కిల్ సీసీఏ టి.తారాచంద్ హాజరై పెన్షనర్ల సమస్యలపై చర్చించారు.సలహాలు, సూచనలు అందించారు. డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ జీఎం మర్రి నాయుడు, ఏఏవో బి.తిరుమలేసునాయుడు, సీనియర్ అకౌంటెంట్ నారాయణమూర్తి, అధికారులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



విజేతలతో ఉపాధ్యాయులు

ఎచ్చెర్ల: లావేరు మండలం తామాడ ఆదర్శ పాఠశాలలో శుక్రవారం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి మెంటార్‌గా వి.శ్రీనివాసరావు వ్యవహరించారు. వ్యాసరచన, డ్రాయింగ్, క్విజ్ పోటీల విజేతలకు ప్రిన్సిపాల్ డానియల్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం కలిగించాలి



డాక్టర్ రఘునందన్‌ను సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం: ఉత్తమ సేవలు అందించడం ద్వారా శ్రీకాకుళం రిమ్స్‌లో రోగుల సంఖ్య పెరిగేలా చూడాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ రఘునందన్ అన్నారు. శ్రీకాకుళం రిమ్స్‌ను శుక్రవారం సందర్శించారు. పలు విభాగాల అధిపతులు, జూనియర్ డాక్టర్లు, పీజీ విద్యార్థులతో సమీక్షించారు. ఔట్ పేషెంట్, ఇన్ పేషెంట్ల సంఖ్య పెంచాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు మరింత నమ్మకం కలిగేలా సేవలు అందాలన్నారు. అనంతరం మెరుగైన సేవలు అందిస్తామని పీజీ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రసూతి విభాగం, చిన్న పిల్లల వార్డుతో పాటు, అత్యవసర వార్డులను పరిశీలించారు. అనంతరం రఘునందన్‌ను కళాశాల ప్రిన్సిపాల్ వెంకటాచలం, సూపరింటెండెంట్ డాక్టర్ షకీల తదితరులు సత్కరించారు.

పూడికలు తరలించేదెప్పుడో?



హడ్కోకాలనీలో కాలువ పక్కన పూడికల కుప్పలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలోని హడ్కో కాలనీ తదితర ప్రాంతాల్లో ఇటీవల కాలువల్లో పూడికలు తీసి పక్కనే పడేశారు. వాటిని తరలించకపోవడంతో మళ్లీ కాలువల్లో పడి పూడుకుపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

దేవీ ఆశ్రమంలో పూజలు



ఎచ్చెర్ల: మండలంలోని కుంచాలకుర్మయ్యపేట దేవీ ఆశ్రమంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజరాజేశ్వరీ అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. కుంకుమార్చనలు, ప్రత్యేక హారతి పూజలను ఆలయ వ్యవస్థాపకులు బాలభాస్కరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు.

జాతీయ స్థాయి నాటిక పోటీలు ప్రారంభం



నాటిక పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు, నిర్వాహకులు



ఆశ కదరా శివ నాటికలో ఓ సన్నివేశం

శ్రీకాకుళం కల్చరల్: కళలను ప్రతి ఒక్కరూ ఆదరించాలని, నాటక కళను బతికించేందుకు సుమిత్రా కళాసమితి చేస్తున్న కృషి ప్రశంసనీయమని వక్తలు కొనియాడారు. జిల్లా కేంద్రంలోని బాపూజీ కళామందిర్‌లో సుమిత్రా కళాసమితి ఆధ్వర్యంలో ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమంతు చిన్నరాములు స్మారక జాతీయస్థాయి నాటిక పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. సమితి గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన విశాఖ జీవీఎంసీ ఈఈ పాగిరి సుగుణాకరరావు మాట్లాడుతూ నాటకాలు మంచి జీవిత అనుభూతులను కలిగిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు, సుమిత్రా కళాసమితి అధ్యక్ష కార్యదర్శులు ఇప్పిలి శంకర శర్మ, గుత్తు చిన్నారావు, లోకనాథం రామలింగేశ్వరరావు, నక్క శంకరరావు, మండవిల్లి రవి, కిల్లా ఫల్గుణరావు, కె.సురేష్, యు.పూజ, రాజు, ప్రధాన విజయరామ్, ఎం.పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు..

అనకాపల్లికి చెందిన షిరిడిసాయి వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన 'ఆశ కదరా శివ' నాటిక చక్కగా సాగింది. పిల్లలు ఆస్తుల కోసం తమ తల్లిదండ్రులను వేధించవద్దనే వృత్తాంతంతో నాటిక ప్రదర్శన సాగింది. పి.టి.మాధవ్ రచించిన ఈ నాటికకు ముత్యాలరావు దర్శకత్వం వహించారు.

సమాజ వికాస రచనలు అవసరం



కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న కవులు



యురవే కవి సమ్మేళనంలో పాల్గొన్న రచయితలు

శ్రీకాకుళం కల్చరల్ : సామాజిక అంశాలపై కవితలు, రచనలు సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలుగు రచయితల వేదిక అధ్యక్షుడు ఉత్తరావిల్లి నాగేశ్వరరావు అన్నారు. బలగ హడ్కో కాలనీ గ్రంథాలయంలో సాహిత్య చైతన్య కిరణాలు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ కవితా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తెరవే ప్రధాన కార్యదర్శి ఆర్.వి.రమణమూర్తి మాట్లాడుతూ కవితా దినోత్సవం జరుపుతున్న సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. భోగెల ఉమామహేశ్వరరావు 'నా కవిత నేను కవినే' అంటూ కవితలు చదివి వినిపించారు. అనంతరం నిక్కు అప్పన్న రచించిన 'నా జన్మభూమి బుడితి' పుస్తకాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో కవులు ముట్నూరు ఉపేంద్రశర్మ, చాడ శ్రీనివాస్, కుదమ తిరుమల, గ్రంథాలయాధికారి పి.ఉగ్రసేను, కుప్పిలి త్రినాథరావు, కొప్పల సూర్యనారాయణరావు, ఇద్దిపాపయ్య, బాలాజీ, బోనెల గాంధీ, కిమ్మి సంతోష్, ఐఎన్‌డీ ప్రసాద్ పాల్గొన్నారు.

యురవే ఆధ్వర్యంలో..

శ్రీకాకుళం కల్చరల్: రైతు బజారు వద్ద విద్యాలయంలో శుక్రవారం కవితా దినోత్సవం సందర్భంగా యువ రచయితల వేదిక (యురవే) ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. యురవే అధ్యక్షురాలు తంగి ఎర్రమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సాహితీవేత్తలు హాజరై కవితలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా కుముద తిరుమలరావు మాట్లాడుతూ కవితలు సామాజిక బాధ్యతను గుర్తు చేసేవిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు జంధ్యాల శరత్‌బాబు, పాట్నూరు మాలతి, గుడిమెట్ల గోపాలకృష్ణ, బగాది వెంకటరావు, ఆనెం భాస్కరరావు, పేడాడ వేదవతి, కరకవలస వాసవి, బలివాడ ధనుంజయరావు, చింతాడ రామచంద్రరావు, మండల గణస్వామి, ఐసీహెచ్‌కేవీ భాస్కరరావు, కిల్లాన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నతో ఇథనాల్ ఉత్పత్తి



మొక్కజొన్న క్షేత్రం వద్ద డైరెక్టర్ జాట్, వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు

రణస్థలం: మొక్కజొన్న నుంచి ఇథనాల్‌ను ఉత్పత్తి చేయడం ద్వారా రైతుల ఆదాయం మెరుగుపడుతుందని ఐసీఏఆర్ (భారతీయ మొక్కజొన్న పరిశోధన స్థానం) లూథియానా డైరెక్టర్ డాక్టర్ హెచ్.ఎస్.జాట్ అన్నారు. మండలంలోని పతివాడపాలెం, పిషిణి, నెలివాడ గ్రామాల్లో పెద్దాపురం, ఆముదాలవలసకు చెందిన వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలతో కలిసి దుక్కి దున్నకుండా మొక్కజొన్న సాగుచేస్తున్న రైతుల క్షేత్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ ఇంధన అవసరాల దృష్ట్యా మొక్కజొన్న వంటి పునరుత్పాదక వనరులతో ఇంధనం ఉత్పత్తి చేస్తే పర్యావరణానికి మేలు కలగడమే కాకుండా ఇథనాల్ ఉత్పత్తికి డిమాండ్ పెరిగి మొక్కజొన్న ధరలు పెరగవచ్చని చెప్పారు. రైతులు మొక్కజొన్న విత్తే సమయంలో ఎరువులు వేయడం లేదని, శాస్త్రవేత్తల సిఫారసు మేరకు ఎరువుల వినియోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధించడానికి అవకాశం ఉందని వివరించారు. పెద్దాపురం వ్యవసాయ పరిశోధన సీనియర్ శాస్త్రవేత్త వి.సుజాత మాట్లాడుతూ మొక్కజొన్న సాగుకోసం రైతులు మోతాదు మించి నత్రజని ఎరువులు వినియోగిస్తే సాగు ఖర్చులు పెరగడంతో పాటు పర్యావరణానికి హాని కలుగుతుందని చెప్పారు. మొక్కజొన్న పంట వ్యర్థాలను కాల్చడం వల్ల పర్యావరణానికి హాని జరిగి భూసారం క్షీణిస్తుందన్నారు. ఆముదాలవలస వ్యవసాయ పరిశోధన ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి.చిట్టిబాబు, కృషి విజ్ఞాన కేంద్రం డాక్టర్ ఎస్.కిరణ్‌కుమార్‌లు మొక్కజొన్న సాగులో మెలకువలు, యాంత్రీకరణ విధానాలపై రైతులకు శిక్షణనిచ్చారు.

కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ భూసార విభాగం శాస్త్రవేత్తలు డాక్టర్ కుమార్ అభిషేక్, డాక్టర్ శిలాదిత్య, డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు, ఏరియా మేనేజర్లు పి.తవిటినాయుడు, బి.లక్ష్మీనరసింహమూర్తి, ఆర్.దేవుడుబాబు, సమన్వయకర్తలు, రైతులు పాల్గొన్నారు.

గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థులు ఉన్నత భావాలు కలిగి గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో శుక్రవారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఫైనలియర్ విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో అలరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల డీపీడీసీ సభ్యులు, పూర్వ విద్యార్థుల సంఘ ప్రతినిధులు సురంగి మోహనరావు, బలివాడ మల్లేశ్వరరావు, ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి, ఇందిరాప్రసాద్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్టేడియం పనులు వేగవంతం చేయండి

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలోని కోడి రామ్మూర్తి స్టేడియం పనులు వేగవంతం చేసేలా చొరవ తీసుకోవాలని శాప్ ఎండీ గిరీషను శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. ఈ మేరకు శుక్రవారం శాప్ కార్యాలయంలో గిరీష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పనులు వేగవంతంగా జరిగేలా చూడాలని, కాంట్రాక్టర్లకు బిల్లుల పెండింగ్ లేకుండా చెల్లింపులు చేపట్టాలని విన్నవించారు. జిల్లాలో క్రీడల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఇద్దరు గ్రామ కార్యదర్శుల సస్పెన్షన్

ఎచ్చెర్ల క్యాంపస్: గతంలో ఫరీదుపేటలో ఇన్‌చార్జి గ్రామ కార్యదర్శులుగా పనిచేసిన శ్రీనివాసరావు, రాజేశ్వరిలను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఎచ్చెర్ల ఎంపీడీవో కార్యాలయానికి సమాచారం అందింది. శ్రీనివాసరావు ఎచ్చెర్ల రెగ్యులర్ గ్రామ కార్యదర్శిగా ఉంటూ ఫరీదుపేటలో 2021 సెప్టెంబర్ నుంచి 2022 జూన్ వరకు ఇన్‌చార్జిగా పనిచేశారు. రాజేశ్వరి భగీరథపురం రెగ్యులర్ కార్యదర్శిగా ఉంటూ ఫరీదుపేటలో 2022 జూలై నుంచి డిసెంబర్ వరకు ఇన్‌చార్జిగా పనిచేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపొనెంట్ బిల్లుల చెల్లింపు, పంచాయతీ రికార్డుల నిర్వహణ లోపంపై కలెక్టర్‌కు మీకోసం గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో అధికారులు విచారణ నిర్వహించి చర్యలు తీసుకున్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శ్రీశివానీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో శుక్రవారం శక్తియాప్‌పై పోలీసులు అవగాహన కల్పించారు. డౌన్‌లోడ్ చేసుకునే విధానాన్ని వివరించి మహిళల భద్రతపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ కోసం అవస్థలు



ఆధార్ కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్న చిన్నారులు, తల్లిదండ్రులు

ఎచ్చెర్ల: లావేరు మండల కేంద్రం పాత పంచాయతీ కార్యాలయంలో ఆధార్ నమోదు, అప్‌డేట్ కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు. రేషన్‌కార్డులో ఐదేళ్లలోపు చిన్నారులకు ఈ నెలాఖరు లోపల ఈకేవైసీ చేయించకపోతే ఆయా యూనిట్లకు రేషన్‌కార్డుల్లో పేర్లు రద్దుతో పాటు బియ్యం సరఫరా నిలిచిపోతుందని రెవెన్యూ, పౌరసరఫరాల అధికారులు హెచ్చరించిన సంగతి తెలిసిందే. దీంతో ఒక్కసారిగా పిల్లాపాపలతో తల్లిదండ్రులు ఆధార్ నమోదు కేంద్రాల వద్దకు వచ్చి పడిగాపులు కాస్తున్నారు. ఎండ వేడికి తట్టుకోలేక చిన్నారులు అవస్థలు పడుతున్నారు. ఈకేవైసీ గడువు తేదీని పొడిగించాలని పలువురు కోరుతున్నారు.

వైద్య శిబిరానికి స్పందన



డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్, నైస్ ఫౌండేషన్, జెమ్స్ వైద్యుల సహకారంతో దేవునిపాలవలసలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పైడిభీమవరం పంచాయతీ పరిధిలోని ముక్కుపాలవలస, దేవునిపాలవలస గ్రామాల్లోని 240 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ యూనిట్ హెడ్ కేవీఎస్ఎన్ రాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. - రణస్థలం

సంతోషిమాతకు పూజలు



పాతశ్రీకాకుళంలోని సంతోషి మాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు మోదుకూరి కిరణ్ శర్మ ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. అనంతరం పూలతో అలంకరించారు.

- శ్రీకాకుళం కల్చరల్

భవనానికి మోక్షమెన్నడో?



ఎచ్చెర్లలో గ్రామ సచివాలయం భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. రూ.40 లక్షలు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపొనెంట్ నిధులతో భాగంగా చేపట్టిన ఈ నిర్మాణం సివిల్ పనులు పూర్తయ్యాయి. ప్రహరీ, తలుపులు, కిటికీలు వంటివి అమర్చాల్సి ఉంది.చివరి దశలో భవన నిర్మాణం ఆగిపోయింది.

- ఎచ్చెర్ల క్యాంపస్

'ఉపాధి'లో ప్రథమ స్థానమే లక్ష్యం



మాట్లాడుతున్న పీడీ సుధాకరరావు

జి.సిగడాం : ఉపాధి పనుల నిర్వహణలో శ్రీకాకుళం జిల్లా మొదటి స్థానం సాధించడం లక్ష్యంగా కృషి చేస్తున్నామని పథకం ప్రాజెక్టర్ డైరెక్టర్ బి.సుధాకరరావు తెలిపారు. శుక్రవారం జి.సిగడాం మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీల ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె పండగ పనుల కోసం రూ.700 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. అందులో జిల్లాకు రూ.370 కోట్లు విడుదలయ్యాయని తెలిపారు. ఇప్పటి వరకు రూ.233 కోట్లు ఖర్చు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 77 వేల మంది వేతనదారులు పనులకు హాజరవుతున్నారని చెప్పారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని సిబ్బందికి స్పష్టం చేశారు. ప్రతి వేతనదారుకు రోజుకు కనీసం రూ.300 వచ్చేలా పనులు చేయించాలన్నారు. ఎండల తీవ్రత నేపథ్యంలో ఉదయం 7 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు పనులు చేస్తే కూలి గిట్టుబాటు అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ కాయల రమణ, ఏపీడీలు లోకేష్, పంచాది రాధ, ఎంపీడీఓ గుంటముక్కల రామకృష్ణారావు, ఏపీఓ చోళ్ల సత్యనారాయణ, ఈసీ గేదెల పురుషోత్తంనాయుడు, సర్పంచ్‌లు, నాయకులు కుమరాపు రవికుమార్, మీసాల రవికుమార్, పైల విష్ణుమూర్తి, బూరాడ వెంకటరమణ, బగాది అప్పలనాయుడు, సాకేటి నాగరాజు, తిరుమరెడ్డి వెంకటరావు, తాళాబత్తుల పైడిరాజు, భూపతి అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేయడం తగదు



నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధి వేతనదారులు

జి.సిగడాం: మండల జాడ గ్రామంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ కోరాడ శ్రావణి ఎటువంటి తప్పు చేయకున్నా సస్పెండ్ చేయడం తగదని వేతనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికకు విచ్చేసిన పీడీ సుధాకరరావుకు సమస్య వివరించారు. గ్రామంలో సుమారు 400 మంది వేతనదారులు పనులు చేస్తున్నారంటూ, శ్రావణి ఎటువంటి అకవకతవకలు చేయలేదని స్పష్టం చేశారు. శ్రావణి భర్త కేశవరావు తమతో పనికి వస్తుంటారని, అందుకే ఓ వ్యక్తి తప్పుడు ఫిర్యాదు చేశారని చెప్పారు. ఇటీవల నిర్వహించిన సామాజిక తనిఖీ బృందం వచ్చిన సమయంలోనూ గ్రామస్తులు గానీ, వేతనదారులు గానీ శ్రావణిపై ఫిర్యాదు చేయలేదని పేర్కొన్నారు. అనంతరం పీడీ స్పందించి మరోసారి దర్యాప్తు చేయిస్తామని హామీ ఇచ్చారు.

నేడు మండల సమావేశం

ఎచ్చెర్ల: లావేరు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం పది గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నామని ఎంపీడీఓ పి.వెంకటరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ లుట్ట అమ్మాజమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.